సాక్షి
నంద్యాల
సోమవారం : 2 : జూన్ : 2025



ప్రశాంతంగా పోలీసు రాత పరీక్ష

పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఆదివారం కర్నూలులోని 16 కేంద్రాల్లో మెయిన్స్ రాత పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు. 8లో ▸



'ఉపాధి' కూలీల ఆకలి కేకలు!

ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లే కూలీలకు మార్చి నెల నుంచి ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వలేదు. ఈ పథకం కింద చేసిన పనులకు బిల్లుల చెల్లింపు నిలిచి పోయాయి. 8లో ▸



పోలీస్ స్టేషన్‌లో బైఠాయింపు

మంత్రాలయం రూరల్: శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలని చెట్నెహాళ్లి గ్రామస్తులు కొందరు ఆదివారం మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో బైఠాయించారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1100ను సంప్రదించ వచ్చున్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తుల ప్రస్తుత సమాచారాన్ని meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవడంతో పాటు తమ అర్జీలు కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

శాస్త్రోక్తంగా పల్లకీ సేవ



స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.

'రియల్' మోసం

కృష్ణగిరి: అమకతాడు సమీపంలోని జాతీయ రహదారికి సమీపంలో రియల్ ఎస్టేస్ ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేశారు. దీంతో ఆదివారం కొనుగోలు దారులు నిరసన తెలిపారు. గ్రామ సమీపంలోని విశ్వాస్ అండ్ వీవీకే, రాయలసీమ రతనాలసీమ టౌన్‌షిప్ వారు వెంచర్ వేశారని బాధితులు తెలిపారు. నమ్మి కొనుగోలు చేశామని, ఇదే ప్లాట్లను డబుల్ రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ వెంచర్ ఓనర్ విజయ్‌కుమార్‌ను సంప్రదించాలని ప్రయత్నించగా అందుబాటులోకి రావడం లేదన్నారు. దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని శివయ్య, ముత్యాలయ్య,శిరీష తదితరులు కోరారు.

శ్రీమఠం.. భక్తజనసంద్రం



శ్రీమఠం కారిడార్‌లో కిక్కిరిసిన భక్తుల

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయం ఆదివారం భక్తజన సంద్రమైంది. ఇరు తెలుగు రాష్ట్రాల భక్తులే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా మంత్రాలయానికి తరలి వచ్చారు. రాఘవేంద్రస్వామి మూల బృందావన దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. మంచాలమ్మ, అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాదం కౌంటర్లు భక్తులతో కిటకిటలాడాయి.



పేదల అవస్థలు కనిపించవా?

ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు ఆశమ్మ. మండల కేంద్రం పగ్యిడాల సమీపంలోని పాలమర్రి సొంతూరు. పుట్టుకతోనే అంధురాలు. సుమారు 80 ఏళ్ల వయస్సు పైబడిన ఆమె రేషన్ కోసం చెల్లెలు సాయంతో డీలర్ వద్దకు చేరుకుంది. (రేషన్‌కార్డు నంబర్ 2809443847) క్యూలో పెట్టి దుకాణం బయట కాలుతున్న బండలపై కూర్చుని వంతు కోసం నిరీక్షించింది. గత ప్రభుత్వంలో వాహనం ఇంటికి వచ్చి వేసేవారని, మళ్లీ పాత రోజుల్లో ఎదుర్కొన్న కష్టాలు తప్పవని వాపోయింది.



ఎమ్మెల్యే వస్తారని..

ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఆత్మకూరు పట్టణంలోని రేషన్ దుకాణం. బియ్యం, కాటా, అన్ని సిద్ధంగా ఉన్నా.. కార్డుదారులు, డీలరు ఎక్కడికి పోయారని అనుకుంటున్నారా..? డీలరు రాఘవేంద్ర ఆదివారం ఉదయం 8.30 గంటలకే దుకాణం తెరిచాడు. అయితే శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన తర్వాత బియ్యం పంపిణీ చేస్తామని తేల్చి చెప్పాడు. ఉదయం 10 గంటల వరకు వేచి ఉన్న కార్డుదారులు ఆ తర్వాత వెళ్లిపోయారు. ఎమ్మెల్యే తీరిగ్గా 11 గంటల తర్వాత వచ్చి దుకాణం ప్రారంభించి పంపిణీ చేపట్టారు. అయితే అప్పటికే కార్డుదారుల్లో కొందరు పనులకు వెళ్లిపోవడంతో మొదటి రోజు రేషన్ తీసుకోలేక పోయారు.



బేతంచెర్ల పట్టణంలో రేషన్ దుకాణం వద్ద సరుకుల కోసం వేచిఉన్న కార్డుదారులు

సమస్యలు వరుస కట్టి..
కష్టాలు బరువెక్కి!

- మళ్లీ పాత పద్ధతిలో రేషన్ పంపిణీ
- చౌక దుకాణాల వద్ద కార్డుదారుల అవస్థలు
- సర్వర్ పని చేయక గంటల కొద్ది నిరీక్షణ
- వృద్ధులు, దివ్యాంగులకు తప్పని ఇక్కట్లు

నంద్యాల(అర్బన్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సేవలను కుదిస్తుండటంతో ప్రజల కష్టాలు అన్నీఇన్నీ కావు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఎండీయూ వాహనాలతో ఇంటి వద్దకు రేషన్ డెలివరీ చేయగా.. నేడు పాత పద్ధతిలోనే చౌకదుకాణాల వద్దనే రేషన్ పంపిణీ చేపట్టడంతో కార్డుదారులు అవస్థలు పడుతున్నారు. రేషన్ డోర్ డెలివరీని రద్దు చేసిన ప్రభుత్వం డీలర్ల చేతికి పగ్గాలు అప్పగించి ఆదివారం నుంచి పంపిణీ ప్రారంభించింది. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా చౌక దుకాణాల వద్ద కార్డుదారుల నిరీక్షణ కనిపించింది. సర్వర్ పని చేయక గంటల వద్ద వేచి ఉన్నారు. వృద్ధులు, దివ్యాంగులు బియ్యం మూటను తీసుకెళ్లలేక ఇక్కట్ల పాలయ్యారు. జగనన్న రేషన్ బండ్లను గుర్తు చేసుకుంటూ కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. జిల్లాలో 1,204 రేషన్ షాపులున్నాయి. వీటి పరిధిలో 5.41 లక్షల రేషన్ కార్డులున్నాయి. వీరందరికీ ప్రభుత్వం ప్రతి నెలా ప్రభుత్వం 7373.381 మెట్రిక్ టన్నుల వరకు బియ్యం, 258.706 టన్నుల వరకు చక్కెర మాత్రమే పంపిణీ చేపట్టింది. పాత పద్ధతి రేషన్ పంపిణీపై కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. 2019 ముందు రేషన్ పంపిణీ కోసం కార్డుదారులు పడిగాపులు కాసేవారు. అప్పట్లో ప్రజలకు సకాలంలో సరుకులు అందేవి కావు. కాస్త ఆలస్యమైతే రేషన్ లేదని వెనక్కి పంపించేసేవారు, ఇచ్చిన సరుకుల్లో కోతలు కనిపించేవి. గోనె సంచి, డబ్బాలతో అక్రమాలకు పాల్పడేవారు. ఇలా భారీగా రేషన్‌లో కోతలు పడేవి. మళ్లీ రేషన్ కష్టాలు వచ్చాయని ఆందోళన చెందారు. మొదటి రోజు జిల్లాలో అనేక ప్రాంతాల్లో సర్వర్లు మొరాయించడంతో రేషన్ పంపిణీ నిలిచి పోవడంతో నిరీక్షణలు తప్పలేదు. మజరా గ్రామంలోని కార్డుదారుల పరిస్థితిపై అధికారులు ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోకపోవడంతో మళ్లీ బియ్యం మోత తప్పదా అంటూ నిట్టూర్చుతున్నారు. బియ్యం కోసం పనులు మానుకుని నాలుగైదు కి.మీ వెళ్లాల్సి వస్తోంది.



నంద్యాల పట్టణంలో బియ్యం మూటను నెత్తిన పెట్టుకుని వెళ్తున్న వృద్ధురాలు



పగిద్యాలలో బియ్యం మూటను ఇంటికి తీసుకెళ్లడానికి అవస్థలు పడుతున్న చిన్నారులు

అక్రమాలకు అడ్డుకట్ట పడేనా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలకు మేలు చేసేలా ప్రణాళికలు తయారు చేసింది. ప్రధానంగా రేషన్ పంపిణీలో పారదర్శకతను తీసుకొచ్చింది. ఎండీయూ వాహనాల ద్వారా ప్రతి నెలా 1వతేది నుంచి 17 తేదీ వరకు వీధి వీధికి వెళ్లి కార్డుదారులకు రేషన్ పంపిణీ చేసింది. అప్పట్లో డీలర్ల ఆటలకు తాళం వేసినట్లు అయ్యింది. అయితే కూటమి ప్రభుత్వం మళ్లీ డీలర్ వ్యవస్థ ద్వారా రేషన్ పంపిణీ చేపట్టడంతో అక్రమాలు పెరిగే అకాశం ఉంది. రేషన్ మాఫియాకు అనుకూలంగా ప్రభుత్వం చర్యలు ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ వ్యాపారానికి అడ్డుగా ఉన్న కొందరు డీలర్లను తొలగించి కూటమి నేతలకు అనుకూలమైన వారిని డీలర్లుగా నియమించుకున్నారు. ఇలా ఈ ఏడాది కాలంలో దాదాపు 180 మంది డీలర్లను కొత్తగా నియమించినట్లు సమాచారం.



కోవెలకుంట్ల రేషన్‌షాపు వద్ద వేచి ఉన్న కార్డుదారులు



ఉయ్యాలవాడ మండలం రూపనగుడిలో సర్వర్ పని చేయక పోవడంతో వెనుదిరిగి వెళ్తున్న దృశ్యం

ఎండీయూ వ్యవస్థ ఎంతో మేలు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమం ఎంతో బాగుండేది. వీధుల్లో సైతం వాహనాలను తీసుకొని వచ్చి ఆపరేటర్లు రేషన్ పంపిణీ చేసేవారు. సమయం వృథా కాకుండా ఉండేది. రేషన్ సరుకులు సైతం సక్రమంగా కార్డు దారులకు అందేవి. కూటమి ప్రభుత్వం తెచ్చిన డీలర్ వ్యవస్థ చిక్కులతో కూడుకుంది. ప్రస్తుత తరుణంలో సమయం ఎంతో విలువైంది. దూరాన ఉన్న షాపుకు వెళ్లి సమయం వృథా చేసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం పునరాలోచన చేసి ఎండీయూ వ్యవస్థను తిరిగి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– రత్నస్వామి, ఎస్‌టీబీసీ కాలనీ, నంద్యాల

గంటల తరబడి నిలబడాల్సిందే



రేషన్ షాపునకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటే క్యూలో ఎక్కువ సమయం నిలబడాల్సి వస్తుంది. డీలర్లు సరుకులు అయి పోయాయని చెబుతారేమోనని కార్డుదారులు క్యూలైన్‌లో ఉంటున్నారు. ఒక్కో కార్డుదారుడు రేషన్ తీసుకోవాలంటే 10 నుంచి 15 నిమిషాలు పడుతుంది. ఈ లెక్కన రెండుమూడు గంటలు సమయం కేటాయిస్తే తప్ప రేషన్ సరుకులు అందేలా లేవు. జనాలు ఎక్కువగా ఉన్నారు. రేపు రావాలంటూ డీలర్లు హుకుం జారీ చేస్తుంటే.. రేషన్ వద్దు.. ఏమీ వద్దు అనే పరిస్థితులు వస్తున్నాయి.

– రవి, పొన్నాపురం

మా పరిస్థితి అర్థం కావడం లేదు



ఎండీయూ వాహనం ఉన్నంత వరకు రేషన్ సరుకులు తీసుకోవడంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేది. ఈనెల నుంచి డీలర్ వద్దే సరుకులు తీసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. మాఊరు నుంచి సరుకులు తీసుకోవాలంటే నాలుగు కి.మీ దూరంలో ఉన్న కమ్మవారిపల్లె పోయి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు మా పరిస్థితి అర్థం కావడం లేదు. డీలర్ ఇక్కడికే వస్తారా లేదా అనేది తెలియడం లేదు.

– గంగోత్రి, లక్ష్మంపల్లె, కొలిమిగుండ్ల మండలం

ప్రజలపై కక్ష సాధింపు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలపై కక్షసాధింపులా ఉన్నాయి. జూటూరు గ్రామంలోని రేషన్ దుకాణం వద్ద మజరా గ్రామమైన కోల్స్ నందాపురం ప్రజలు కిలో మీటరు దూరం వచ్చి సరుకులు తీసుకొని పోవాలి. బైక్ ఉన్నవాళ్లు సరే. బైక్ లేని వాళ్లు కాలినడకన వచ్చి తీసుకెళ్లాల్సిందే కదా. ఈ నిర్ణయం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది.

–తిరుపతయ్య, జూటూరు, పాములపాడు మండలం

కేంద్రీయ విద్యాలయానికి రాజకీయ గ్రహణం!

- విద్యా సంవత్సరం ప్రారంభం కావస్తున్నా వెలువడని ప్రవేశాల నోటిఫికేషన్
- తాత్కాలిక తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల భవనం సిద్ధం
- అడ్డుకుంటున్న కూటమి నేతలు
- జిల్లా కేంద్రానికి తరలించేందుకు ఎంపీ శబరి ప్రయత్నం?

డోన్: కేంద్రీయ విద్యాలయం మంజూరు.. శాశ్వత భవన నిర్మానానికి స్థలం కేటాయింపు.. తరగతుల నిర్వహణకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అధికారుల అనుమతి.. తాత్కాలికంగా తరగతుల నిర్వహణకు డోన్ ఐటీఐ నూతన భవనం ఎంపిక, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నియామకం.. అయినా రాజకీయ గ్రహణంతో విద్యా సంవత్సరం ప్రారంభం కావస్తున్నా ప్రవేశాల నోటిఫికేషన్ ఇప్పటి వరకు వెలువడలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అప్పటి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కేంద్ర విద్య మానవ వనరుల మంత్రిత్వ శాఖ అధికారులను ఒప్పించి డోన్‌కు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయించారు. మంజూరై రెండేళ్లు గడిచినా తరగతుల నిర్వహణకు కూటమి నేతలు బ్రేక్ వేస్తున్నారు. సకల వసతులతో కూడిన తాత్కాలిక భవనం సిద్ధం చేసినా ప్రవేశాల నోటిఫికేషన్ వెలువడకుండా నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి అడ్డుపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డోన్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల భవనాలలో తరగతుల నిర్వహణకు అన్ని వసతులు అనుకూలంగా ఉన్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల బృందాలు పలు మార్లు ధ్రువీకరించినా కూడా ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ కాకపోవడంతో ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డోన్‌కు మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని జిల్లా కేంద్రం నంద్యాల తరలించేందుకు ఎంపీ ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యంతో జిల్లాలో కేంద్ర ఉద్యోగస్తుల పిల్లలు, ప్రతిభా విద్యార్థులు ఎంతో నష్టపోతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభించినట్లయితే ఒకటి నుంచి 8 వరకు తరగతులు నిర్వహించే అవకాశం ఉందని డోన్ ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు. ఒక్కొక్క తరగతికి 40 మంది విద్యార్థులను కేటాయిస్తామన్నారు. డోన్ కేంద్రీయ విద్యాలయానికి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా కర్నూలు విద్యాలయ ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శినిని నియమించారు. అయినా పాఠశాల ప్రవేశాలకు నోటిఫికేషన్ జాప్యమవుతుండటంతో అటు ఉద్యోగులు, ఇటు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



KENDRIYA VIDYALAYA SANGATHAN

DEPUTY COMMISSIONER

ప్రభుత్వ ఐటీఐ భవనంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ డిప్యూటీ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలు



విద్యార్థుల కోసం సిద్ధంగా ఉన్న బెంచీలు



ఐటీఐ విద్యార్థుల వసతి కోసం ఏర్పాటు చేసిన భవన సముదాయం

అన్ని అనుమతులు ఉన్నా జాప్యం..

డోన్‌కు మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని గతేడాది డిసెంబర్ 31వ తేదీన డిప్యూటీ కమిషనర్ మంజునాథ్ ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వ ఐటీఐలో నాన్‌లోకల్ విద్యార్థుల బస కోసం రూ.3 కోట్ల వ్యయం చేసి అత్యాధునిక వసతులతో నిర్మించిన భవన సముదాయంలో తాత్కాలికంగా కేంద్రీయ విద్యాలయాన్ని నిర్వహించుకోవచ్చునని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ మహంద్ ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ అధికారుల ప్రత్యేక బృందం సభ్యులు ఈ భవనాన్ని సందర్శించి సౌకర్యాలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. అయినా పాఠశాల ప్రారంభంపై అధికారులు నోరు మెదపడం లేదు.

విద్యా హబ్‌గా డోన్..

డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు విద్య, వైద్య, తాగు, సాగు, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధి కోసం రూ.3 వేల కోట్లు కేటాయించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ బాల, బాలికల కోసం నాలుగు ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు, బేతంచెర్లలో ప్రభుత్వ ఐటీఐ, ప్యాపిలి మండలంలో వెటర్నిటీ పాలిటెక్నిక్, గొర్రెల పెంపకం శిక్షణ కేంద్రం, ఉర్దూ పాఠశాల లాంటివి అనేకం ఏర్పాటు చేయడంతో నంద్యాల జిల్లాలో డోన్ విద్యాహబ్ స్థాయికి ఎదిగింది. డోన్‌కు మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని ఈ ఏడాది ప్రారంభిస్తే విద్యా కిరీటంలో మరో కలికి తురాయిగా నిలిచిపోవడం ఖాయమని ప్రజలు భావిస్తున్నారు.

జాప్యం చేస్తే న్యాయ పోరాటం



అట్టడుగు బలహీన వర్గాల్లో ప్రతిభ గల నిరుపేద పిల్లలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి విద్యను అందించింది. ఈ క్రమంలోనే మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కేంద్రీయ విద్యాలయాన్ని డోన్‌కు మంజూరు చేయించాం. ఈ ఏడాది తరగతులు ప్రారంభించకుండా స్కూల్‌ను జిల్లా కేంద్రానికి తరలించేందుకు టీడీపీ కూటమి నేతలు ప్రయత్నిస్తే న్యాయ పోరాటం చేస్తాం.

– బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ మంత్రి

పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీపై కూటమి కుట్ర

- ఉద్యోగాల పేరుతో స్థానికులను రెచ్చగొడుతున్న టీడీపీ నేతలు ?
- ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని బెదిరించే ప్రయత్నం
- ధర్నాకు పిలుపు ఇవ్వడంతో కార్మికులు, ప్రజల ఆందోళన

బేతంచెర్ల: టీడీపీ నాయకుల స్వార్థ రాజకీయాలతో పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ కల్పన విషయంలో టీడీపీ నాయకులు కొత్త నాటకానికి తెరలేపడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీడీపీ హయాంలోనే నష్టాలతో ఈ ఫ్యాక్టరీ మూతపడటంతో వందలాది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మూతబడిన ఫ్యాక్టరీని తెరిపించేందుకు అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేసిన కృషి ఎవరూ మరిచిపోలేరు. ప్రస్తుతం సవ్యంగా కొనసాగుతున్న పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యాన్ని బెదిరించే ధోరణిలో టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యోగాల పేరుతో స్థానికులను రెచ్చగొట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తున్నారనే చర్చ కొనసాగుతోంది. ఈ ప్రాంతవాసుల ఉపాధి కల్పించాలనే నెపంతో సోమవారం ఫ్యాక్టరీ ఎదుట టీడీపీ ధర్నాకు పిలుపు ఇచ్చింది. అయితే టీడీపీ నేతల తీరును గ్రామస్తులు, కార్మికులు తప్పుపడుతున్నారు. ఉద్యోగాల పేరుతో ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

బాబుది వెన్నుపోటు చరిత్ర



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి నాయకులు

ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి చరిత్ర అంతా మోసం, దగా, వెన్నుపోట్లు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 4వ తేదీన నిర్వహించే 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం.. నిరసన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల్లో కల్లబొల్లి హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత హామీలను చూస్తుంటే భయమేస్తోందంటూ బీద ఏడుపులు ఏడవటం చంద్రబాబుకే సాధ్యమన్నారు. ఆర్థిక వ్యవస్థ సరిపోదని, సంపద ఎలా సృష్టించాలో చెవిలో చెప్పండని ప్రజలను ఎగతాళి చేస్తున్నారని విమర్శించారు. ప్రతి మంగళవారం తెచ్చే అప్పులు ఎవరికి పంచుతున్నారన్నారని ప్రశ్నించారు. రెడ్‌బుక్‌ను చూసి ఎవరూ భయపడే పడే పరిస్థితిలో లేరని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగేశ్వర్‌రావు, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

కేజే రెడ్డి కొనుగోలు చేసిన భూములు రద్దు చేయాలి

- నిజ నిర్ధారణ కమిటీ సభ్యుల డిమాండ్



బాధిత రైతులతో మాట్లాడుతున్న నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు

కర్నూలు (టౌన్): కొంపల్లి తండా, ఉలిందకొండ, ఎర్రకత్వ గ్రామాల్లో కేజే రెడ్డి తన అనుచరుల పేరు మీద కొనుగోలు చేసిన భూముల క్రయవిక్రయాలను వెంటనే రద్దు చేయాలని నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది క్రిష్ణ, బీసీ జన సభ నాయకులు శేషఫణి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయా గ్రామాల్లో నిజ నిర్ధారణ కమిటీ పర్యటించింది. భూములు అన్యాయంగా కోల్పోయిన వారితో సభ్యులు మాట్లాడారు. తాము సాగు చేసుకుంటున్న భూములను కేజే రెడ్డి బలవంతంగా లాక్కున్నారని, ఎకరా రూ. 50 వేలు చెల్లించి రూ. 6 లక్షలు చెల్లించినట్లు రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించారని బాధితులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే కేజే రెడ్డి రైతులను భయపెట్టి వారి భూములను తన అనుచరుడైన నాగరాజు పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. అంతేకాకుండా అదే గ్రామానికి చెందిన నాగన్న అతని కుమారులు సంజీవ్, విష్ణు, అశోక్ అనే వ్యక్తులపై కేజే రెడ్డి తప్పుడు కేసులు నమోదు చేయించి వారిని ఉలిందకొండ పోలీసుల సాయంతో గ్రామం నుంచి బహిష్కరించారని చెప్పారు. అన్యాయంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, పోలీసులు నాగన్నను హింసించినందుకు నష్ట పరిహారం రూ.50 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం చైతన్య పోరాట సమితి నాయకులు షేక్ బాజీద్, న్యాయవాది రఘునాథరెడ్డి, రామకుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె రూరల్: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన అబ్దుల్‌గని(45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ వెంకట రమణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అబ్దుల్‌గని మద్యానికి బానిస కావడంతో కుటుంబీకులు మందలించారు. దీంతో మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రసాయన పౌడర్‌ను నీళ్లలో కలుపుకుని తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య ఫకూర్‌బీ, ఇద్దరు సంతానం ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మిల్క్ వ్యాన్ దగ్ధం



ప్యాపిలి: జాతీయ రహదారిపై పోతుదొడ్డి వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో మిల్క్ వ్యాన్ దగ్ధమైంది. హైదరాబాదు నుంచి పలమనేరుకు వెళ్తున్న మిల్క్‌వ్యాన్ పోతుదొడ్డి వద్దకు రాగానే ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే వ్యాన్‌ను రోడ్డుకు ఓ వైపు ఆపి దిగాడు. కొద్ది సేపటికే మంటలు వ్యాన్ మొత్తానికి వ్యాపించడంతో వ్యాన్ పూర్తిగా దగ్ధమైంది.

ఆటో బోల్తా - బాలుడి మృతి

ప్యాపిలి: పట్టణ సమీపంలో ఆదివారం ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఓ బాలుడు చెందాడు. పట్టణానికి చెందిన రంగస్వామి కుమారుడు దివాకర్ (12) ఆటోలో వెళ్తుండగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో దివాకర్ పైన పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

‘ఉపాధి’ కూలీల ఆకలి కేకలు!

- 30 లక్షల పని దినాలకు నిలిచిపోయిన చెల్లింపులు
- పేద ఇళ్లల్లో తీవ్ర ఇబ్బందులు
- అయినా స్పందించని రాష్ట్ర ప్రభుత్వం



కౌతాళం మండలంలో జరుగుతున్న ఉపాధి పనులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లే కూలీలకు మార్చి నెల నుంచి ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వలేదు. ఈ పథకం కింద చేసిన పనులకు బిల్లుల చెల్లింపు నిలిచి పోయాయి. జిల్లాలో రూ.182 కోట్లకుపైగా బకాయిలు పేరుకు పోయాయి. ఆర్థిక సంవత్సరం మొదలై రెండు నెలలు అవుతున్నా నిధులు రాలేదు. కేంద్రంలో చక్రం తిప్పుతున్న సీఎం చంద్రబాబు.. ఉపాధి హామీ పథకానికి సంబంధించి నిధులు ఎందుకు తేలేకపోతున్నారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రెక్కలు వంచి పనిచేసిన కూలీలకు వేతనాలు లేకపోవడంతో ఆకలితో అలమటిస్తున్నారు.

పేదల కుటుంబాల్లో సంక్షోభం

ఉపాధి వేతనాల కోసం జిల్లాలో 1.50 లక్షల కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, పెద్దకడుబూరు, హాలహర్వి, ఆలూరు, ఆదోని, కోసిగి, దేవనకొండ, హొళగుంద, ఆస్పరి తదితర మండలాలకు ఉపాధి పనులే ఆధారం. ఈ ఏడాది మార్చి నెల 15 వరకు ఉన్న ఉపాధి వేతనాలను చెల్లించారు. మార్చి నెల 16 నుంచి దాదాపు రెండున్నర నెలలుగా ఉపాధి కూలీలకు ఒక్క రూపాయి వేతనం కూడా ఇవ్వలేదు. మొత్తం 30 లక్షల పని దినాలకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఒక పని దినం విలువ రూ.307 ఉండగా.. కూలీలు చేసే పని పరిమాణాన్ని బట్టి సగటున రోజుకు రూ.290 వరకు వేతనం పడుతుంది. ఈ ప్రకారం కూలీలకు చెల్లించాల్సిన వేతనాల మొత్తం దాదాపు రూ.87 కోట్లు ఉంటుంది. వేతనం అందకపోవడంతో పేదల కుటుంబాల్లో సంక్షోభం నెలకొంది. వేసవిలో ఉపాధి పనులకు అత్యధికంగా 1.16 లక్షల మంది కూలీలు హాజరయ్యారు. వేతనాలు లేకపోవడంతో నేడు కూలీల హాజరు 80 వేలకు పడిపోయింది.

పనులు తప్ప నిధులు శూన్యం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పల్లెపండుగ అంటూ హడావుడి చేసింది. ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు, గోకులం షెడ్లు వంటి వాటిని చేపట్టారు. జిల్లాలో 800 సీసీ రోడ్లు, 1254 గోకులం షెడ్లు నిర్మించారు. అయితే ఇంతవరకు నిధులు ఇవ్వలేదు. పల్లె పండగ పేరుతో హడావుడి చేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఉన్నతాధికారులు నేడు మౌనంగా ఉండిపోయారు. సీసీ రోడ్లకు దాదాపు రూ.65 కోట్లు, గోకులం షెడ్లకు రూ.16 కోట్ల నిధులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండిపోయాయి. వాటర్‌షెడ్ కింద చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు రూ.6 కోట్లు, మెటీరియల్ కాంపోనెంటు కింద చేపట్టిన పండ్లతోటల అభివృద్ధి తదితర వాటికి దాదాపు రూ.8 కోట్ల బిల్లులు ఇవ్వాల్సి ఉంది.

వేతన.. వేదన

జిల్లాలో జరుగుతున్న ఉపాధి పనులతో పాటు గోకులం షెడ్లు తదితర వాటిని పర్యవేక్షించేందుకు జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులకు అద్దె వాహనాలు వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. పీడీ, అడిషినల్ పీడీ, ఐదుగురు ఏపీడీలు ఏడు అద్దె వాహనాలు వినియోగించారు. ఎనిమిది నెలలుగా అద్దె వాహనాలకు బిల్లులు ప్రభుత్వం చెల్లించలేదు. అలాగే ఉపాధి హామీ పథకం పనులను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పర్యవేక్షించే సిబ్బందికి (800మందికి) మూడు నెలలుగా వేతనాలు అందలేదు. గతంలో ఎన్నడూ ఇంతటి దారుణమైన పరిస్థితి లేదని ఉపాధి సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన వద్దు



ఉపాధి కూలీలకు వేతనాలు మార్చి నెల 16 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. ఉపాధి ఉద్యోగులకు కూడా మార్చి నుంచి వేతనాల్లేవు. జిల్లాలో 30 లక్షల పని దినాలకు వేతనాలు విడుదల కావాల్సి ఉంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే అన్నింటికి నిధులు విడుదల అయ్యే అవకాశం ఉంది.

– వెంకటరమణయ్య,
ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కర్నూలు

ప్రభుత్వం ఏం చేస్తుందో?



వ్యవసాయ పనులు లేనపుడు మాకు ఉపాధి పనులే ప్రధాన ఆధారం. నేను. నా భార్య, కుమారుడు, కోడలు మొత్తంగా నలుగురం ఉపాధి పనులకు వెళ్తున్నాం. మార్చి నెల 16 నుంచి ఇప్పటి వరకు చేసిన పనికి వేతనాలు అందలేదు. కూలీలకు వారం.. వారం వేతనాలు చెల్లిస్తే ఉపశమనం కలుగుతుంది. రెండున్నర నెలలుగా వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయి. పేదలు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం ఏం చేస్తుందో అర్థం కావడం లేదు.

– బంగి ఈరన్న, తుగ్గలి

ఎలా బతకాలి



ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి వెళ్లి మండుతున్న ఎండల్లో మధ్యాహ్నం 11 గంటల వరకు ఉపాధి పనులకు వెళ్లి రెక్కలు వంచి పని చేశాం. రెండున్నర నెలలుగా కూలి చెల్లించకపోతే ఎలా బతకాలి. సోమవారం నుంచి శనివారం వరకు పనిచేస్తే ఆదివారం కూలీ డబ్బులు చేతికి అందితే సంతృప్తి ఉంటుంది. ఉపాధిలో మాత్రం రెండున్నర నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

– వి.ఉలిగమ్మ, గుడికంబాలి,
కౌతాళం మండలం

మెడికల్ దుకాణాలపై అధికారుల దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(హాస్పిటల్): ‘ఔషధం...ప్రాపగండం’ శీర్షిక గత నెల 29న ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి ఔషధ నియంత్రణ అధికారులు స్పందించారు. ఈ మేరకు శని, ఆదివారాల్లో కర్నూలు నగరంలోని 25 మెడికల్‌షాపుల్లో కర్నూలు, వైఎస్సార్ కడప, అనంతపురం ఔషధ నియంత్రణ శాఖ అధికారులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. హోల్‌సేల్ ప్రాపగండ కండిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీలతో పాటు ఆసుపత్రుల్లోని ఫార్మసీలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో మందుల ధరలు, వాటి నాణ్యతలు, మందుల లేబుళ్లను పరిశీలించారు. మొత్తం 25 దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ తనిఖీల్లో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్ట నిబంధనలను పాటించని షాపులను గుర్తించి ఆ షాపులపై చర్యలు తీసుకునేందుకు నివేదికలు తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు డి.హరిహరతేజ, షేక్ పర్వీన్ సుల్తానా(కర్నూలు), పి.హనుమన్న(అనంతపురం), దాదా కలందర్(నంద్యాల), ఎస్.జయరాముడు, పి.కేశవరెడ్డి(అన్నమయ్య), జి.మాధవి(వైఎస్ఆర్ కడప) పాల్గొన్నారు.

రాజీనామాలు చేయాలని బెదిరించడం అన్యాయం



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

మంత్రాలయం: రాజీనామా చేసి వెళ్లాలంటూ.. ఇస్పాత్ మారుతి ఉక్కు పరిశ్రమలోకి అడుగుపెట్టవద్దని అడ్డుకోవడం అన్యాయం అని స్థానిక ప్రాంత ఉద్యోగులు ఆదివారం ఆందోళనకు దిగారు. మాధవరం సమీపంలో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయగా దాదాపు 3,500 మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు చెందిన వారి సంఖ్య కేవలం 40 మాత్రమే. వారిని కూడా తొలగించే యోచనలో పరిశ్రమ యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ప్రాసెస్ యూనిట్లో పనిచేస్తున్న అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కేశవరెడ్డి, ఎగ్జిక్యూటివ్‌లు ఉగ్రం రవి, నరసింహులు అనే ఉద్యోగులను ఇంటికి సాగనంపారు. తాజాగా మరో 17 మంది ఉద్యోగులను తొలగించేందుకు సమాయత్తమయ్యారు. రాజీనామా చేసి వెళ్లాలంటూ పరిశ్రమలో ప్రాసెస్ యూనిట్‌లో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులపై ఆదివారం ఒత్తిడి తెచ్చారు. ప్రాసెస్ యూనిట్ సీనియర్ ఇంజనీర్ టిప్పు సుల్తాన్ (ఆదోని), జూనియర్ ఆఫీసర్ రాజశేఖర్ యాదవ్ (ఇబ్రహీంపురం గ్రామం, నందవరం మండలం) ఎగ్జిక్యూటివ్ ప్రభాకర్ (బనవనూరు గ్రామం, ఆస్పరి మండలం) ను గేట్ బయటే నిలిపివేశారు. కొందరు స్థానిక ఉద్యోగుల సహకారంతో వారు నిరసన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ బయటే గంటపాటు నిరసన గళం వినిపించారు. తాను 8 ఏళ్లుగా ఫ్యాక్టరీ ఇంజనీర్‌గా పనిచేస్తున్నానని, తన ఉద్యోగం పోతే కుటుంబం రోడ్డున పడుతుందని, అధికారులే తనకు న్యాయం చేయాలని టిప్పు సుల్తాన్ కోరారు. ఉద్యోగం పోతే ఎలా బతకాలో తోచడం లేదని జూనియర్ ఆఫీసర్ రాజశేఖర్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

డీపీఓలో 90 మంది బదిలీ

కర్నూలు(అర్బన్): జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ పరిధిలో ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 90 మంది ఉద్యోగులకు స్థాన చలనం కలిగించినట్లు జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్ తెలిపారు. ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఒకే ప్రాంతంలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారితో పాటు రిక్వెస్ట్‌లను పరిగణనలోకి తీసుకుని బదిలీలు నిర్వహించామన్నారు. బదిలీ అయిన వారిలో డిప్యూటీ ఎంపీడీఓ, గ్రేడ్ -1 నుంచి గ్రేడ్ -4 వరకు ఉన్న పంచాయతీ కార్యదర్శులు మొత్తం 90 మంది ఉన్నారన్నారు.

టీడీపీ నేతల బరితెగింపు



సీఐతో వాగ్వాదం పడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి

కొలిమిగుండ్ల: చింతలాయిపల్లెలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై ఆదివారం టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఆ తర్వాత ఉద్దేశపూర్వకంగా దాడికి పాల్పడటంతో ముగ్గురు వైఎస్సార్‌సీపీ నాయకులు గాయపడ్డారు. గ్రామానికి చెందిన జమాల్‌రెడ్డి అమ్మవారికి మొక్కుబడి కార్యక్రమం చేయడంతో విందుకు వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి చంద్రమోహన్‌రెడ్డితో పాటు పలువురు నాయకులను ఆహ్వానించారు. అబ్దులాపురం రోడ్డులో వాహనం నిలిపి టీడీపీ నాయకుల ఇంటి మీదుగా నడుచుకుంటు వెళ్లారు. విందు పూర్తయ్యాక తిరిగి వస్తుండగా టీడీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా సిమెంట్ రోడ్డుపై ట్రాక్టర్ ఇంజిన్, బైక్ అడ్డుపెట్టారు. అయినా ఆగకుండా ముందుకు సాగడంతో వెనుక నుంచి కట్టెలు, రాడ్లు విసిరివేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈగొడవలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలం సంజీవకుమార్‌రెడ్డితో పాటు కార్యకర్తలు రవీంద్రబాబు, కంబగిరిరాముడుకు గాయాలయ్యాయి. ఆతర్వాత వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో చంద్రమోహన్‌రెడ్డి ఇంటి వద్ద గుమికూడారు. సీఐ రమేష్ బాబు సిబ్బందితో అక్కడికి చేరుకొని వైఎస్సార్‌సీపీ నాయకులను మందలించడంతో ఒక్కసారిగా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిని కాకుండా మమ్మల్ని ఎందుకు పంపిస్తున్నారని సీఐతో వాగ్వాదానికి దిగారు. అక్కడే సీసీ రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. టీడీపీ నాయకులు పథకం ప్రకారం వాహనాలు అడ్డుపెట్టి దాడికి పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఇరు పార్టీల నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు.



గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత సంజీవకుమార్‌రెడ్డి

ప్రశాంతంగా కానిస్టేబుల్ మెయిన్స్ రాత పరీక్ష

కర్నూలు: ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం పోలీస్ కానిస్టేబుల్ (సివిల్, ఏపీఎస్‌పీ) అభ్యర్థులకు కర్నూలులోని 16 కేంద్రాల్లో మెయిన్స్ రాత పరీక్షలు నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ కర్నూలు శివారుల్లోని జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల, బృందావన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్, కేవీ సుబ్బారెడ్డి కళాశాల, అతీనా స్కూల్, మాంటిస్సోరి ఇండస్ రెసిడెన్షియల్ స్కూల్, శంకరాస్ డిగ్రీ కళాశాలలో పరీక్షలు జరిగిన తీరును పరిశీలించారు. 7,597 మంది అభ్యర్థులకుగాను 6,947 మంది అభ్యర్థులు మెయిన్స్ రాత పరీక్షకు హాజరైనట్లు ఎస్పీ వెల్లడించారు. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు జరిగాయన్నారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా, డీఎస్పీలు శ్రీనివాసాచారి, ఉపేంద్రబాబు, హేమలత, సీఐలు, ఎస్ఐలు పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు విధులు నిర్వహించారు.



పర్యవేక్షిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం



కర్నూలులోని పరీక్షా కేంద్రం వద్ద బారులుదీరిన అభ్యర్థులు

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనం

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం ముగిసింది. ఆదివారం నుంచి మూల్యాంకనానికి సంబంధించిన వాటిని స్కానింగ్ చేస్తున్నారు. గత నెల 12వ తేదీ నుంచి మొదలైన సప్లిమెంటరీ ప్రధాన పరీక్షలు 17వ తేదీ వరకు జరిగాయి. 19, 20 తేదీల్లో ఒకేషనల్, బ్రిడ్జ్ కోర్సు పరీక్షలు జరిగాయి. గత నెల 20వ తేది నుంచి సప్లమెంటరీ పరీక్షల మూల్యాంకనం మొదలు పెట్టారు. జిల్లాకు 93,338 సమాధాన పత్రాలు జిల్లాకు వచ్చినట్లు క్యాంపు ఆఫీసర్ గురువయ్య శెట్టి తెలిపారు. రెండు, మూడు రోజుల్లో మూల్యాంకన ప్రక్రియ పూర్తి కానుందని ఆయన వెల్లడించారు.

ప్రసూతి విభాగంలో కోతుల బెడద





కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో కోతుల బెడద అధికమైంది. ఈ విభాగంలో ఉదయం నుంచి రాత్రి వరకు కోతులు మందలు మందలుగా వస్తూ రోగులు, వారి సహాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లల విభాగం, న్యూరాలజీ, ఎండోక్రైనాలజీ, గైనకాలజీ విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు సైతం ఇవి చేరుకుంటూ వారి వద్ద ఉన్న ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. వార్డులోని వరండాల్లో భోజనం చేస్తున్న వారిపైనా దాడికి దిగి ఆహార పదార్థాలను లాక్కెళ్తున్నాయి. వార్డు బయట బైక్‌లు, స్కూటీలు, కార్లలో ఉంచిన పదార్థాలు, వస్తువులను సైతం తనిఖీ చేసి పారవేస్తున్నాయి. అందులో తినుబండారాలు ఉంటే వాటిని తీసుకెళ్తున్నాయి. మూకుమ్మడిగా వచ్చే వీటిని ఎలా తరిమేయాలా అని సెక్యూరిటీ గార్డులు తలపట్టుకుంటున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

మద్యం సీసాలు.. పద‘నిషా’లు

ప్రభుత్వ భవనాలు, పొలాలు, ఖాళీ స్థలాలు, కాలువ గట్లు కాదేది మద్యం సేవించేందుకు అనర్హం అంటున్నారు మద్యం బాబులు. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో బెల్టు షాపుల జోరందుకోవడంతో మద్యం ఏరులై పారుతోంది. దీంతో నిత్యం తూలుతున్న మందుబాబులతో సర్వం మద్య సీసాలతో దర్శనమిస్తున్నాయి. తుగ్గలి మండలం రాంపల్లిలోని హెల్త్ సెంటర్, డంపింగ్‌యార్డులో ఎక్కడచూసినా మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. వీటి గాజు పెంకులు గాయాలు చేస్తున్నాయని, ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.

– తుగ్గలి



రాంపల్లిలో అసంపూర్తిగా ఉన్న హెల్త్ సెంటర్‌లో మద్యం సీసాలు



రాంపల్లి డంపింగ్ యార్డులో పడేసిన మద్యం సీసాలు

జెడ్పీలో బదిలీల కౌన్సెలింగ్

- రాజకీయ పైరవీలు లేకుండా నిబంధనల మేరకు బదిలీలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ పరిధిలోని ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ ఆదివారం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ బదిలీల్లో జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. స్థానిక జెడ్పీలోని చైర్మన్ చాంబర్‌లో ఉద్యోగుల బదిలీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి కేడర్‌లో ఐదేళ్లు ఒకే ప్రాంతంలో పనిచేసిన ఉద్యోగుల జాబితా, జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాలను డిస్‌ప్లే చేస్తూ, సీనియారిటీ ప్రకారం కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీల ప్రక్రియ కొనసాగించారు. జెడ్పీ పరిధిలో ఒకే ప్రాంతంలో ఐదేళ్లు పూర్తి అయిన జాబితాలో పరిపాలనాధికారులు 05, సీనియర్ అసిస్టెంట్లు 15, జూనియర్ అసిస్టెంట్లు 17, టైపిస్టులు 03, రికార్డు అసిస్టెంట్లు 03, లైబ్రరీ అసిస్టెంట్లు 05, ల్యాబ్ అసిస్టెంట్లు 04, ఆఫీసు సబార్డినేట్లు 04, స్వీపర్లు 01 మంది ఉన్నారు. అలాగే ఐదేళ్ల లోపు ఉండి రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ముగ్గురు ఎంపీడీఓలతో పాటు మిగిలిన కేడర్లలో 74 మంది ఉన్నారు. ఐదేళ్లు పూర్తి అయిన వారితో పాటు రిక్వెస్ట్ పెట్టుకున్న వారు మొత్తం 134 మంది వివిధ కేడర్లలోని ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. బదిలీలను కోరుకున్న మెజారిటీ ఉద్యోగులు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలతో దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు ఎలాంటి పైరవీలకు తావు లేకుండా జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. కేవలం ఆఫీస్ బేరర్స్, రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న వారు, ఆరోగ్యపరంగా ఇబ్బంది ఉన్న వారికి మాత్రమే మినహాయింపు ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా ... పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా కౌన్సెలింగ్ నిర్వహించడంపై పీఆర్ మినిస్ట్రీయల్ ఉద్యోగ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు ఇంకా జారీ కాలేదు.

గ్రామీణ నీటి సరఫరా విభాగంలో ...

ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఉమ్మడి కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాలకు సంబంధించిన మినిస్ట్రీయల్ ఉద్యోగుల బదిలీలను నిర్వహించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ బి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ బదిలీలు జరిగాయి. ఆయా జిల్లాల పరిధిలోని కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఐదేళ్లు పైబడిన వారిని, రిక్వెస్టులను పరిగణనలోకి తీసుకొని బదిలీలు నిర్వహించారు. బదిలీ అయిన వారిలో ఇద్దరు సూపరింటెండెంట్లు, 30 మంది సీనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు టెక్నికల్ ఆఫీసర్లు, నలుగురు అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లతో పాటు పలువురు ఆఫీసు సబార్డినేట్లు ఉన్నారు.